నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 2 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీట్ ఆఫీసర్ అమరేందర్

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 1 : వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత అని ఫారెస్ట్ బీట్ అధికారి అమరేందర్ పేర్కొన్నారు. ఆదివారం గంటలగూడెం, కాప్రి, బనారుగొంది గ్రామాల ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వల్ల వన్యప్రాణులకు ముప్పు కలుగుతుందన్నారు. ఆర్ వోఎఫ్ఆర్ పట్టాలున్న భూముల్లోనే సాగు చేసుకోవాలని సూచించారు. అటవీ భూమిని ఆక్రమిస్తే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయాల్సివస్తుందని హెచ్చరించారు. ఇప్పపూలు.. ఇతర పండ్ల సేకరణతో ఆర్థికంగా ఎదగాలన్నారు. వావుదాం గ్రామ మాజీ సర్పంచ్ కీర్తనరావు, ఆయా గ్రామాల పటేళ్లు ఆత్రం రాజు, ఆత్రం భీము, బనారు గొంది వీఎస్ఎస్ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ శాఖల నిర్వాహకులు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 1 : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని మంచిర్యాల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారం రెడ్డి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా కేంద్రంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, వైద్య శాఖ, ప్రభుత్వ వైద్య కళాశాల, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవైడీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, ఆర్ఎంవో శ్రీధర్, వైద్యాధికారులు సృజన్, రమ్య శ్రీ, ఐఆర్‌సీఎస్ అధ్యక్షుడు కేబీఎన్ రెడ్డి, డెమో వెంకటేశ్వర్లు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కాంగ్రెస్ పాలనలో విద్యాసంస్థలు ఆగం

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకులం తనిఖీ

ఆసిఫాబాద్ టౌన్,డిసెంబర్ 01: కాంగ్రెస్ పాలనలో విద్యా సంస్థలు ఆగమయ్యాయని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి ముస్తఫాతో కలిసి ఆదివారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల పాఠశాలను సందర్శించారు. వంటశాల పరిసరాలతో పాటు భోజనం, కూర, మెనూను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మంచి విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించేందుకు గురుకులాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎక్కడా ఫుడ్ పాయిజన్ జరిగిన ఘటనలు లేవన్నారు. అనంతరం విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, నాయకులు సాయి శ్రావణ్, శ్రీకాంత్, తాజ్, అరుణ్, ప్రవీణ్, రామ్ శేఖర్ పాల్గొన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే గురుకుల బాటకు అడ్డంకులు

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్
- కోటపల్లి ఆశ్రమ పాఠశాల సందర్శన.. గేట్ తెరవని సిబ్బంది
- వెనుదిరిగిన నాయకులు
- ఎస్సీ వసతి గృహానికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- ఆందోళనకు దిగడంతో కొందరికే అనుమతి

కోటపల్లి, డిసెంబర్ 1 : వసతి గృహాల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే గురుకుల బాట కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నరని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం గురుకుల బాట నిర్వహించగా, గురుకుల బాట ఇన్‌చార్జి చెన్నమల్ల చైతన్య, బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. మొదట కోటపల్లి ఆశ్రమ పాఠశాల సందర్శనకు వెళ్లగా ప్రధాన ద్వారం తెరవకపోవడంతో బీఆర్ఎస్వీ నాయకులు వెనుతిరిగారు. అక్కడి నుంచి కోటపల్లిలోని ఎస్సీ వసతి గృహానికి వెళ్తుండగా, ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. ఎస్సీ హాస్టల్ ప్రధాన ద్వారం ముందే బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగగా, కొంతమందిని మాత్రమే లోపలికి అనుమతించారు. నాయకులు విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వసతి గృహం శిథిలావస్థకు చేరిందని, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవని, విద్యార్థులు అసౌర్యాల నడుమ ఉంటున్నా సర్కారు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్వీ నాయకులు మండిపడ్డారు. వసతి గృహాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆరోపించారు. కుళ్లిపోయిన కూరగాయలతో భోజనం పెట్టడం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురై మరణిస్తున్నారన్నారు. బాలికల వసతి గృహాల్లో మహిళా సిబ్బందినే నియమించాలని, రాత్రి పూట పురుషులైన ఉపాధ్యాయులు బస చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి హాస్టల్‌లో ఇన్వర్టర్‌లతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందు, అనిల్, రాజ్‌కుమార్, పవన్, నూతన్ పాల్గొన్నారు.

కోటపల్లి ఎస్సీ హాస్టల్‌లోకి వెళ్లకుండా బీఆర్ఎస్వీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న నాయకులు

సర్కారు నిర్లక్ష్యం వల్లే 52 మంది మృతి

ఆర్కేపీలోని గురుకులాన్ని సందర్శించిన బీఆర్ఎస్

గురుకులంలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న నాయకులు

మందమర్రి, డిసెంబర్ 1: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 52 మంది విద్యార్థులు మృతి చెందారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం రామకృష్ణాపూర్ పట్టణంలోని గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో వంట గది, సరుకులు నిలువచేసే విధానం, పరిసరాలు, విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసి విద్యార్థులను పొట్టన బెట్టుకుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చెన్నూర్ నియోజక వర్గ నాయకుడు డాక్టర్ రాజా రమేశ్, పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకుడు రామిడి కుమార్, కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, పోగుల మల్లయ్య, రేవెల్లి ఓదెలు, బోయినపల్లి అనిల్ రావు, జిలుకర్ల మహేశ్, గడ్డం విజయలక్ష్మి, అలుగుల శ్రీలత, పారుపల్లి తిరుపతి, కో ఆప్షన్ సభ్యురాలు రజియా, నాయకులు జక్కనబోయిన కుమార్, రామిడి లక్ష్మీకాంత్, బొమ్మ భూమయ్య గౌడ్, నందిపేట సదానందం, ఎల్లబెల్లి మూర్తి, అర్నె సతీశ్, వేనంక శ్రీనివాస్, చంద్రకిరణ్, జాన రాజశేఖర్, ఆశనవేని సత్యనారాయణ, పిల్లి సతీశ్, మణి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు వత్తాసు పలకడం సరికాదు

- బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్
- నాయకులతో కలిసి కాసిపేట గురుకులం సందర్శన
- అడ్డుకున్న పోలీసులు, ప్రిన్సిపాల్

బెల్లంపల్లి, డిసెంబర్ 1 : గురుకులాల యాజమాన్యాలు కాంగ్రెస్ పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ తొత్తులుగా మారాయని, ఇది సరికాదని బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ పేర్కొన్నారు. గురుకులాల బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాసిపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనాథ్, పట్టణ అధ్యక్షుడు అరుణ్, నాయకులు అఖిల్, అశోక్,సాయి, కిరణ్, శివ, పవన్, గణేశ్‌తో కలిసి సందర్శించారు. మెయిన్‌గేట్ వద్దనే ప్రిన్సిపాల్ ఊట్ల సంతోష్‌కుమార్ అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేవని, లోనికి రావడం కుదరదని తేల్చిచెప్పారు. దీంతో కాసేపు వాగ్వాదం జరిగింది. గేట్ ముందు నాయకులు కూర్చొని నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆపై ప్రిన్సిపాల్ పోలీసులకు సమాచారం అందించగా, తాళ్ల గురిజాల ఎస్ రమేశ్ అక్కడికి చేరుకొని.. సందర్శనకు ఎలాంటి అనుమతులు లేవని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. పాఠశాలను సందర్శించే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని వారు భీష్మించుకుకూర్చున్నారు. ఇక్కడి నుంచి వెళ్లకుంటే కేసులు బుక్ చేస్తామని ఎస్ఐ చెప్పడంతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ప్రిన్సిపాల్ వచ్చి కండువాలు తీసి సందర్శించవచ్చని సూచించడంతో నాయకులు శాంతించి లోనికి వెళ్లారు. ఆపై అన్నం ఉడికిందా లేదా, నాణ్యమైన బియ్యాన్ని వండారా లేదా అని పరిశీలించారు. నీళ్ల లాగా ఉన్న కోడిగుడ్డు కూరను చూసి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం స్టోర్ గదుల్లోకి వెళ్లి కూరగాయాలు, వస్తు సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటామని ముందుకు వెళ్తుండగా ప్రిన్సిపాల్ మరోసారి అడ్డుకున్నారు. విద్యార్థులతో మాట్లాడేది లేదని సూటిగా చెప్పారు. కాసేపు వాగ్వాదం అనంతరం నాయకులు బయటికి వచ్చారు.

నాయకులను అడ్డుకుంటున్న తాళ్ల గురిజాల ఎస్ఐ రమేశ్

- వరుస దాడులు

భద్రతపై నీలినీడలు!

ఉమ్మడి జిల్లాలో వణుకు పుట్టిస్తున్న టైగర్స్

- నిత్యం ఎక్కడో చోట పశువులపై పంజా
- గన్నారంలో బాలికను చంపిన ఘటన
- మరవకు ముందే దుబ్బ గూడలో మరో రైతుపై పంజా
- గతంలో విషప్రయోగంతో రెండు పులుల మృతి
- ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వాటి సంరక్షణపై పలు అనుమానాలు
- పులుల వివరాలపై గోప్యత ఏదీ!
- అవగాహన కల్పించడంలో విఫలమవుతున్న అధికారులు
- అటవీశాఖలో ఖాళీలతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు
- కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో డీఎఫ్‌వోలు అందరూ ఇన్‌చార్జులే

మంచిర్యాల, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లోకి పులుల రాకపోకలు పెరగగా, సమీప గ్రామాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. నిత్యం ఎక్కడో చోట పశువులు.. మనుషులపై దాడులు చేస్తూ హడలెత్తిస్తున్నాయి. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం గన్నారం సమీపంలో పత్తి ఏరుతున్న మోర్ల లక్ష్మిపై దాడి చేసి చంపగా, అది జరిగి 24 గంటలైనా గడవక ముందే శనివారం సిర్పూర్-టీ మండలం దుబ్బగూడలో రైతు సురేశ్‌పై పంజా విసిరి తీవ్రంగా గాయపరిచింది. ఇక గతంలో పులులపై విషప్రయోగం జరగగా, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వాటి భద్రతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.

పులుల భద్రతపై అనుమానాలు

యేటా ఈ సీజన్‌లో మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ నుంచి పులులు రాకపోకలు సాగిస్తుంటాయి. అవి రాకముందే ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు.. దాడులు జరిగినప్పుడే స్పందించి ఆపై మిన్నకుండి పోతున్నారు. గతంలో జరిగిన ఘటనల నుంచి పాఠాలు నేర్చుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. గతేడాది ఆసిఫాబాద్ జిల్లాలో ఓ పెద్దపులి.. దాని పిల్లలు పాడిపశువులపై దాడులు చేశాయి. విసిగిపోయిన పలువురు రైతులు పులి చంపేసిన పశువుపై విషప్రయోగం చేశారు. ఆ మాంసాన్ని తిన్న పెద్దపులితో పాటు ఓ పిల్ల పులి సైతం మృతిచెందింది. కాగజ్‌నగర్ డివిజన్ దరిగాంలో చోటు చేసుకున్న ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేవలం పాడిపశువులనే చంపేస్తున్నాయన్న కోపంతోనే పులులకు విషం పెట్టినట్లు నిందితులు చెప్పారు. ఇప్పుడు సైతం అదే తరహాలో ప్రతి రోజూ ఏదో ఒక చోట పెద్దపులుల దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దపులుల భద్రతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పులుల వివరాలపై గోప్యత ఏదీ..

సాధారణంగా అడవిలో పెద్దపులుల కదలికలుంటే ఆ వివరాలు బయటికి చెప్పకూడదు. వేటగాళ్లు పులులపై దాడి చేసే అవకాశాలు ఉంటాయని అధికారులు వివరాలను గోప్యంగా ఉంచుతారు. చలికాలంలో తోడు కోసం బయటికి వచ్చే పెద్ద పులులు జనవాసాల్లోకి వస్తుండడంతో వా టిపై ఫోకస్ పెరిగింది. ఎక్కడ పులి కనిపించినా నిమిషాల్లో సోషల్ మీడియాలో అది చక్కర్లు కొ డుతున్నది. అధికారులకు సమాచారం తెలిసేలో పే మీడియాలో పులి వార్తలు వస్తున్నాయి. పులి వివరాల్లో గోప్యత అన్నది ఎక్కడా కనిపించడం లేదు. బీట్ ఆఫీసర్లు, వాచర్లు, కొందరు అటవీ శాఖ అధికారులు పులి కదలికలపై డైరెక్ట్‌గా ప్రకటనలు ఇస్తున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే సమయంలో జనవాసాల్లోకి వచ్చే పులుల గురించి సమాచారం ఇవ్వడంలో అటవీశాఖ అధికారులు విఫలమవుతున్నారు. పు లులను ట్రాక్ చేయలేకపోతున్నారు. పులి తిరుగుతున్న సమీపంలోకి గ్రామాలు, గూడేలు, తం డాల్లో ముందస్తు సమాచారం ఇచ్చి జనాలు ఎ వ్వరూ బయటికి రాకుండా చూడాలి. కానీ అది సరిగా జరగడం లేదు. అందుకే పులుల దాడులంటూ వరుస ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. మరి ఇప్పటికైనా అధికారులు పులుల వివరాలపై గోప్యత పాటిస్తారా.. లేదా అన్నది వేచి చూడాల్సి ఉన్నది.

ఇబ్బంది లేదు : శాంతారాం, ఎఫ్‌డీపీటీ

సాధారణంగా చలికాలంలో పులులు అడవుల్లోకి వస్తాయి. వాటి భద్రతపై ఎలాంటి సందేహాలు అవసరం లేదు. ప్రొటక్షన్ స్ట్రక్చర్ బాగుంది. బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పులుల కదలికలు కనిపెడుతున్నారు. సీసీ కెమెరాలు సైతం బిగించి ఉన్నాయి. వాచర్స్, యానిమల్ ట్రాకర్స్ నిత్యం తిరుగుతూనే ఉన్నారు. కొంత ఖాళీలు ఉన్నాయి. ముఖ్యంగా బీట్ ఆఫీసర్ల ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి. కానీ వాటితో పెద్దగా ఇబ్బంది ఏం లేదు. ప్రజలు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదు.

అటవీశాఖలో వెక్కిరిస్తున్న ఖాళీలు..

పులుల భద్రతపై అనుమానాలు తలెత్తడానికి ప్రధాన కారణం అటవీశాఖలో ఖాళీలు ఉండడమే. మరీ ముఖ్యంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఒక్క డీఆర్‌వో పోస్టులు తప్ప మిగిలిన పోస్టుల్లో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి. టైగర్ రిజర్వ్‌లో మంచిర్యాలలో తప్ప ఎక్కడా కూడా ఎఫ్‌డీవోలు పర్మినెంట్ వారు లేరు. చెన్నూర్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, ఖానాపూర్, ఉట్నూర్ ఎఫ్‌డీవో పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. జన్నారంలో ఏడాదిన్నరగా, చెన్నూర్‌లో నాలుగు నెలలుగా, బెల్లంపల్లిలో రెండున్నరేళ్లుగా, ఆసిఫాబాద్‌లో రెండేళ్లగా, ఖానాపూర్‌లో యేడాదిగా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ఉట్నూర్, కాగజ్‌నగర్ దాదాపు మూడేళ్లు ఖాళీగా ఉన్నాక అక్కడ ట్రైనీలకు పోస్టింగులు ఇవ్వనున్నారు. వచ్చే ఐఎఫ్ఎస్‌లు ట్రైనింగ్ పూర్తి చేసుకొని వెళ్లిపోతే అక్కడ మళ్లీ ఖాళీలు ఏర్పడనున్నాయి. ఖానాపూర్‌కు ఆర్మూర్ ఎఫ్‌డీవో భవాని శంకర్, ఆసిఫాబాద్‌కు జిల్లా డీఎఫ్‌వో నీరజ్ కుమార్, బెల్లంపల్లి, జన్నారం ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా మంచిర్యాల డీఎఫ్‌వో శిశ్ ఆశిశ్ సింగ్, చెన్నూర్‌కు మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇక బీట్ ఆఫీసర్ల పోస్టులైతే దాదాపు 45 శాతం వరకు ఖాళీ ఉన్నాయి. ఈ మధ్యే పది, పదిహేను మందికి గ్రూప్-4 ఉద్యోగాలు రావడంతో వెళ్లిపోయారు. వంద పోస్టులు ఉంటే.. ప్రస్తుతం 45 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇక ఎఫ్ఆర్‌వో పోస్టులు సైతం ఖాళీలుగా ఉన్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో ఒకటి, ఆసిఫాబాద్ డివిజన్‌లో ఒకటి, మంచిర్యాలలో ఒకటి, జన్నారంలో రెండు, ఖానాపూర్‌లో ఒకటి చొప్పున ఎఫ్ఆర్‌వో పోస్టులు ఖాళీ ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.